# క్షుధాగ్ని జ్వాల

## ప్రాచీన గాథాలహరి

పి. గణపతిశాస్త్రి

౧

'భవతి, భిక్షాందేహి!' 'భవతి! భిక్షాం దేహి' అని వ్యాసమహర్షి శిష్యులు జైమిని, పైల, సుమంతులు ఇంకా మిగిలిన అంతేవాసులు ఒకే ఒక స్వరంతో గంభీరంగా గొంతెత్తి అరిచారు. అయినా ఆ యిల్లాలెవరో గాని ద్వారం తెరిచిపట్టెడన్నం వారి భిక్షాపాత్రలలో పడవేసిన పాపానపోలేదు. అసలా గృహిణీమతల్లి ఎవరో గాని ద్వారమే తెరవలేదు! చిట్టచివరికి వ్యాసమహర్షి కూడా శాయశక్తులా గొంతెత్తి 'భవతి భిక్షాం దేహి!' అని ముమ్మారు ప్రార్థించాడు. అయినా ఎవరు మారు పలకలేదు!

కాశీకానగరంలో గ్రీష్మతపం నడినెత్తి మాడ్చివేస్తూంది. ఎక్కడా అకల్లాడిన జాడ కూడా కనిపించలేదు. కాకులు కావుకావని అరవడానికి కూడా శక్తిలేక అల్లల్లాడిపోతున్నాయి. అజీవాల ఆర్తనాదం కంఠనాళాలలోనే చిక్కుపడిపోయింది.

తరవాత వ్యాసమహర్షి శిష్యగణంతో మరి ఒక ఇంటికి బయలుదేరాడు. అక్కడా ఎవరు మారు పలకలేదు. అలాగలాగ వారంతా ఆవీథి అంతా గాలించివేశారు. ఎక్కడా ఎవరు ద్వారం తెరచే జాడయినా గోచరించలేదు.

పిమ్మట వారందరు ఇంకొక వీథికివెళ్లారు. ఆవీథిలో కూడా ఎవరూ వారికి పట్టెడన్నం పెట్టిన పాపాన పోలేదు. ఇంకొక వీథికి వెళ్ళారు. కాని అక్కడా అంతే జరిగింది.

వ్యాసమహర్షి శిష్యులందరితోను కలిసి వారణాసీనగరం ప్రవేశించినప్పటినుంచీ ఇదే వరస! పాపం ఎవరు వారికి పట్టెడన్నం పెట్టలేదు.

ప్రఖ్యాతమైన సంజీవగూడు వంధ్యనాడ వారి
అత్యుత్తమైన కుటుంబ ఔషధములు
కాస్మస్ కస్తూరి మాత్రలు...
కలర్జర్ గోరోజన మాత్రలు...
బాలక్స్ ఎదుగుదలకు మాత్రలు...
మా మందుల పూర్తి జాబితాకు వ్రాయుడు
.... కెసరీ, ..., మద్రాసు-1, విజయవాడ

కృష్ణద్వైపాయనుడు శిష్యగణంతో కలిసి వారణాసిలో ప్రవేశించినప్పటినుంచీ క్రమక్రమంగా ఏడు రోజులు గడిచిపోయాయి. ఆ ఏడు రోజుల నించీ శిష్యులకు గాని, వ్యాసునికి గాని ఎక్కడా ఒక్క మెతుకైనా భిక్షాన్నం దొరకలేదు. అదేమి దైవ దుర్విపాకమో మరి!

శ్రీ విశ్వేశ్వర దేవ వతిం సాక్షాత్తుగా వెలిసిన కాశీ మహానగరమది! దివోదాస మహారాజా కాశీరాజ్యం పరిపాలిస్తూంటే ధర్మదేవత నాలుగుపాదాలతోను నడుస్తున్నదని కాశీరాజ్య ప్రజలంతా ఎలుగెత్తి చాటుతున్నారు. ఆ మహారాజు రాజ్యంలోనే వ్యాసమహర్షివంటి మహామహితాత్మునిశిష్యగణాని కెక్కడా పట్టెడన్నం దొరకలేదు!

అంతలో వసగాడ్పు ఒక్కమారుగా ఈ చెంపనించి ఆ చెంపకు ఈడ్చికొట్టింది! ఆ దెబ్బతో చెట్లమీద తలదాచుకొన్న పక్షులన్నీ ఎండుటాకుల్లా గల గలా రాలి నేలమీద పడిపోయాయి! అంతవరకు నడవలేక నడుస్తున్న వ్యాసమహర్షి శిష్యులలో కొందరికి నడవలేక అక్కడే చదికిలపడిపోయారు. కొంతమంది గట్టిగా వడగొట్టి అక్కడే పడిపోయారు. కొనప్రాణాలతో మిగిలిన మరికొందరు శిష్యులు పడిపోయిన వారికి శీతలోపచారాలు చేశారు.

జైమిని అభిభత్సం చూచి వ్యాసమహర్షి సన్నిధికివచ్చి నెమ్మదిగా ఏదో విన్నవింప వలెనని అనుకొన్నాడు. కాని నోరారిపోవడంచేత మరి మాటలాడ లేకపోయాడు. పైల సుమంతాది ప్రధాన శిష్యులకిక ఏ మనడానికీ పాలుపోలేదు.

వారంతా ఆర్యావర్తంలో ఎన్నెన్నో మహాపుణ్యతీరాలు సేవించారు. ఆ పుణ్యతీర్థాలన్నిటిలోను ఎక్కడికి వెళ్లినా మృష్టాన్న భోజనమే! మహర్షి కృష్ణద్వైపాయన సంయమిని సందర్శించవలెననే తహతహతో బ్రహ్మణ్యులనేకులాయన కెదురేగి మహర్షి సముచితమయిన అతిథిసత్కారాలు చేసి తమ తమ జన్మలు పావనమైనాయని భావించేవారు. మహర్షికేగాక శిష్యులందరికీ పంచభక్ష్య పరమాన్నాలతో మృష్టాన్నభోజనం పెట్టి వారి ఆశీర్వచనంలో తలలు వంచేవారు! అలాంటి కృష్ణద్వైపాయన సంయమికీ, శిష్యగణానికీ నేటికిలాంటి దురవస్థ సంప్రాప్తించింది!

అయినా వ్యాసమహర్షి అధైర్యం చెందక మిగిలిన అంతేవాసిగణంతో కలిసి అపార్శ్వంలోఉన్న మరి ఒక వీథికి వెళ్ళాడు. అది కాశీనగరంలో రాజవీథిగా పేరెన్నికగన్న సోమవీథి. ఆ వీథిలో నిలబడి వ్యాసమహర్షి శిష్యులందరితోను కలిసి ఒకే గొంతుతో "భవతి! భిక్షాం దేహి!" అని మూడు సారులు గొంతెత్తి అరిచి భిక్ష పెట్టవలసిందని అర్థించాడు.

సోమవీథిలో ఇండ్లన్నీ ఎండ వేడిమి భరించలేక కళ్లు మూసుకొన్నట్లు కనిపించాయి. ఆ వీథి మధ్యంలో బాటలన్నీ ఎండమావులై మెరిశాయి. అంతేగాని ఒక్కరు వ్యాసమహర్షి అభ్యర్థన ఆలకించే జాడ కనిపించలేదు. అటుపిమ్మట ఒకరిద్దరు శిష్యులిక నిలబడలేక చాపచుట్టుగా బాటమీద పడిపోయారు. పాత్యవతేయ మహర్షికి కూడా నాలుక పిడచకట్టుకుపోయింది. కాళ్లలోనిలబడేశక్తియావత్తు ఒక్కమారుగా నశించిపోయింది.

"విశ్వనాథుడే ప్రత్యక్షదైవతమై ఈ మహానగరం పరిపాలిస్తున్నాడే! అన్నపూర్ణా మహాదేవి ఆయన సన్నిధిని నిలబడి ప్రాణులందరికీ స్వయంగా అన్నప్రదానం చేయిస్తున్నదే! డుంఠి విఘ్నేశ్వరస్వామి, కాలభైరవుడు మొదలయిన దేవతలందరు తామై కొలువున్న పరమపునీతమైన ఈ వారణాసీ నగరంలోనే పట్టెడన్నం కరవైపోయెనే! విశ్వేశ్వరాది మహాదేవతలందరు పరమ ధార్మికులయిన నాశిష్యులందరు అన్నపానాలు లేక ప్రాణాచారాలుపడి పోతున్నా చూచి ఊరకున్నారే! ఈ దేవతలందరు కేవలం కఠినశిలామూర్తులు! కాశీనగరంలోని బ్రాహ్మణులందరు పరమపాపండులు!" అని వ్యాస

మహర్షి హృదయంలో అనేకమైన క్రోధ జ్వాలా పరంపరలు చెలరేగాయి. అతని గర్భంలో క్షుదాగ్నిజ్వాల ఆరని చిచ్చై వెలిగి బ్రహ్మరంధ్రంవరకు నాలుకలు చాచింది!

అంతలో అంతవరకు లోలోపలే రగులుకొంటున్న వ్యాసమహర్షి క్రోధాగ్నిజ్వాల ఒక్కమారుగా భగుమనిమండింది.

కమండలువులో మిగిలిన ఉదకంతో ముమ్మారాచమించి కాశీనగరవాసులందరినీ శాపాగ్నిజ్వాలలతో దహించివెయ్యవలెనని అనుకొన్నాడు. కాని అంతలోనే కొంత నిగ్రహం అవలంబించి ఆనగరవాసులందరినీ ఈక్రింది శాపవాక్యంతో శపించివెయ్యవలెనని నిశ్చయించాడు.

"మా భూత్రైపూరుషీ విద్యా
మాభూత్రైపూరుషం ధనం
మాభూత్రైపూరుషీ భక్తిః
కాశ్యాం నివసతాం సదా."

అనే తీవ్రశాపవాక్యం అతని జిహ్వాగ్రందాకా వచ్చింది.

'కాశీనగరవాసులకు భక్తి విద్యా ధనాలు మూడు, మూడు పురుషాంతరాలవరకైనా సక్రమంగా సంప్రాప్తింపకపోవుగాక!' అని వ్యాసమహర్షి కాశీవాసులందరినీ శపించివెయ్యాలని అనుకొన్నాడు.

కాని అంతలోనే పైలుడిది కనిపెట్టాడు. వెంటనే శిష్యులందరికీ సన్నసన్నగా ఆవిషయం తెలుపుచేశాడు. వారందరు తమ విశాల ఫాలభాగాలపై దోసిళ్ళొగ్గినిలబడి "మహర్షీ! క్రోధం ఉపసంహరించవలసిం" దని పరిపరివిధాలుగా ప్రాధేయపడ్డారు. వ్యాసుడా క్షణంలోనే మణికర్ణికాజలంతో శపించివెయ్యవలెనని నిశ్చయించాడు. అతని బొమముడినుండి క్రోధాగ్నిజ్వాలా ధూమమాలిక సన్నసన్నగా పైకిలేచింది.

## ౨

ఆక్షణంలో కొంత దూరంలో ఒక సన్నని పిలుపు వినిపించింది.

"బ్రాహ్మణవరేణ్యా! ఎందుకయ్యా! నీకంతటి క్రోధం! ఆ శాపసంకల్పం ఉపసంహరించి ఒక్కమారిక్కడికి విచ్చేయవయ్యా!"

ఆ ఆహ్వానం వినేసరికి మహర్షి హృదయంలో అమృతవర్షం కురిసినట్లయింది. గుండె జల్లుమన్నది. కృష్ణద్వైపాయనుడొక్కమారు కన్నులెత్తి ఆ తియ్యని ఎలుగు వెలువడిన దిశపై నవలోకించాడు.

అతని కెదురుగా పచ్చని దబ్బపండువంటి పండు ముత్తైదువ ప్రత్యక్షమైనది. ఆమె అప్పుడే తన భవంతిసింహద్వారం తలుపులోరగా తెరిచి ముంగిలిలో రెండడుగులు వేసి నిలబడింది. ఆమె అందెలసవ్వడి సన్నగా ధ్వనించే కరకంకణాల కలకలంలో విలీనమైపోయింది. ఆముత్తైదువ వేణీభరం చాలావరకు నెరిసిపోయింది. వెడదకన్నులు రెండు ఫాలతలం అంతటికీ ప్రదక్షిణం చేస్తున్నట్టుగా వికసించాయి.

ఆమెను సందర్శించగానే వ్యాసునికి కొంచెం ఆశ రేకెత్తింది. ఆ యిల్లాలు పట్టెడన్నమైనా పెట్టకపోతుందా అని అనిపించింది. నోటి చివరిదాకావచ్చిన శాపవాక్యం అలాగే ఆపివేసి తొందరగా అడుగులు వేసుకుంటూ ఆమె సన్నిధికి వెళ్ళి నిలుచున్నాడు.

ఆమె ఆప్యాయంగా పిలిచిన పిలుపు ఇంకా అతని హృదయంలో మారుమోగుతూనే ఉంది. అది ఎంత తియ్యని పిలుపు!

వ్యాసమహర్షి కా పురంధ్రి ఎవ్వరో తెలియలేదు! అలాగే విస్తుపోయి కొంతసేపామెవైపు చూచాడు. అప్రయత్నంగా అతని హస్తాలు రెండు చేయెత్తి ఆమెకు నమస్కరించాయి

ఆ పురంధ్రీమతల్లి మహర్షి నమస్కారానికి ప్రతి నమస్కారం చెయ్యకుండానే ఒక చిన్న చిరునవ్వు ఒలకబోసి మహర్షి నీ విధంగా మందలించింది:

"నాయనా! విశాలాక్షీదేవి ప్రతిదినము మధ్యాహ్నవేళలో అతిథి అభ్యాగతులందరికీ స్వయంగా మృష్టాన్నం వడ్డించే మహానగరిమతల్లి కాశిక! శ్రీవిశ్వేశ్వర దేవదేవుని అర్ధాంగీమణి! తానై స్వయంగా కాశీనగరిగా అవతరించింది!

"ఏడురోజులపాటన్నం దొరకలేదన్నంతమాత్రాన ఇలాగ పసిపాపలా ఏడుస్తున్నావా? నీ శమదమాది సద్గుణసంపత్తి అంతా ఏమయిపోయిందయ్యా! నీ మహాధైర్యం అంతా ఇంతమాత్రంచేతనే నట్టేట కలిపివేశావయ్యా? ఆకలిగొన్నవారెలాంటి పాపకృత్యానికైనా ఒడిగడతారు! సరిగా అదే జరిగింది.

"పరమశివదేవుని అర్ధాంగి అయినటువంటి కాశికానగరిపైనే కన్నెఱ్ఱజేశావే! ఇది వింటే ఆ దేవదేవునికిక నీమీద ఎంతటి క్రోధం వస్తుందో కొంచెమైనా గ్రహించావా?

బ్రాహ్మణుడవైపోయావు గనక నీమీద కోపగించడం ధర్మంకాదు!

సరే! దానికేమి గాని స్నానం చేసి వెంటనే భోజనానికి రా, నాయనా!"

ఆ ముత్తైదువ ఎంత సన్నసన్నగా చివాట్లు పెట్టినా భోజనానికి రావలసిందని ఆహ్వానించేసరికి మహర్షి గుండె మళ్ళీ జల్లుమంది. ఎంతో భక్తిప్రపత్తులతో ఆ ఇల్లాలి వైపు చూచి సవినయంగా విన్నవించుకొన్నాడు:

"అమ్మా! ఇన్నాళ్ళకైనా భోజనం అనే మాట చెవినిబడేసరికే నా కడుపు నిండిపోయింది! అయితే తల్లీ! ఒక్క సందేహం! భోజనానికి నేనొక్కణ్ణే వచ్చేదా? నా శిష్యులనందరినీకూడా తోడుకొనిరావచ్చునా? అమ్మా! వారివి నా ప్రాణాలవంటివేగదా! వారినందరినీ విడిచిపెట్టి ఒక్కణ్ణే నేనెలాగ రాగలనమ్మా!"

ఆ మాటమీద ఆమె కలకల నవ్వింది:

"నాయనా! నీవు నీ శిష్యులందరినీ వెంటబెట్టుకొని రావచ్చును! మీరందరు వెంటనే స్నానసంధ్యాదులు ముగించుకొని రండి! అంతా తిరిగి వచ్చేసరికి పదార్థాలన్నీ సిద్ధం చేయిస్తాను. నీలకంఠుడు నీ గుండె ధైర్యం పరిశీలించడానికే ఈ విషమ పరీక్ష చేసిఉంటాడు. అంతేగాని కాశీనగరిలో మృష్టాన్నానికి లోటేమిటి నాయనా?"

వెంటనే వ్యాసమహర్షి శిష్యులందరు భాగీరథిలో స్నానసంధ్యాదులు నిర్వర్తించుకొని భోజనానికి వచ్చారు. ముందుగా తమ రాక ఆ యిల్లాలికి తెలియజేశారు.

ఆమె వారినందరినీ ఎంతో ఆప్యాయంగా భవంతిలోపలి కాహ్వానించింది.

ఆ సమయంలో ఒక పరిచారిక ఆమెకు బంగారు గొడుగు పట్టింది ఇంకొక పరిచారిక తాంబూలకరండకం ధరించి అప్పుడప్పుడామెకు కర్పూర తాంబూలపు చిలక లందిస్తూ ఎంతో వినయంగా నిలబడింది.

అనంతరం శిష్యులందరితోనూ కలిసి వ్యాసమహర్షి ఒక విశాలమైన చతుశ్శాలలో సమాసీనుడైనాడు. ఆ చతుశ్శాల అంతటా అగరు ధూమ మాలిక లల్లిబిల్లిగా అలముకొన్నాయి.

అంతలో కొందరు పరిచారకలు వారి అందరి ఎదట లేతలేత అరటిఆకులు వేశారు.

స్థాపితము: 1920 సం॥రం.
సమస్త చర్మవ్యాధులకు, తెలుపు మచ్చలు వగైరాలకు చికిత్సా నిపుణులు.
కేటలాగు, సలహా ఉచితము.
రెడ్డి & కో, (రిజిష్టర్డు)
గోపాలపురం. తూర్పు గోదావరి జిల్లా
(వయా) తణుకు.

శిష్యులందరు తమ దేవతార్చనాదికం ముగించుకొని ఎప్పుడెప్పుడని భోజనాని కెదురు తెన్నులు చూస్తూ కూర్చున్నారు. అంతలో ఆ ముత్తైదువ బ్రాహ్మణు లందరికీ క్రమంగా అపోశనం వడ్డించింది. పైల సుమంతాదివ్యాసశిష్యులందరు కలిసి మున్నూరుగురుదాకా ఉన్నారు. అందరికీ అంతలోనే అంత విందు జరగగలదంటే వారెవరికీ ఏమీ నమ్మిక కలగలేదు.

వారందరు అపోశనం వడ్డించినా ఇంకా భోజనపదార్థాలు రాలేదేమని అలాగే ఎదురు తెన్నులు చూచారు.

"మరికొందరు ఎక్కడా వంటకాలు చేసిన జాడగాని, పొగచిన జాడగాని లేదే! ఇంతమందికీ ఈ ఇల్లాలు భోజనం వడ్డించగలదా? లేక ఇదంతా కపటనాటకమేనా!" అని ఆశ్చర్యపోయారు.

ఇంకా మరి కొంద 'రా ముత్తైదువ మాటలలో ఎక్కడా కల్లా, కపటము కానరావే! ఎంతో చల్లదనం వెల్లివిరిసిందే! ఇంతా చేసి పట్టెడన్నమైనా పెట్టలేకపోతారా?' అని అనేక విధాలుగా వితర్కించుకొన్నారు.

అలాగ కొంచెంసేపు గడిచిపోయిన పిమ్మట కొందరు పరిచారికలు వచ్చి అరిటాకులలో పంచభక్ష్య పరమాన్నాలు, ఇంకా ఎన్నెన్నో చిత్ర చిత్రమైన వంటకాలు వడ్డించారు. వ్యాసమహర్షి శిష్యులు ఆ పదార్థాలన్నీ కంఠదఘ్నంగా ఆరగించి, గ్రుడ్ల త్రేన్చారు. అనంతరం కొందరు పరిచారికలు వారందరికీ కర్పూర తాంబూలాలందించారు.

తలవని తలంపుగా కలిసివచ్చిన ఆ అదృష్టానికి మురిసిపోతూ శిష్యులందరు ఎంతో సంతోషించారు. వేదికలపై సుఖాసీనులై భుక్తాయాసం తీర్చుకొంటూ కూర్చున్నారు. సాక్షాత్తు కాశీవిశ్వనాథుని దేవేరి అన్నపూర్ణాదేవే స్వయంగా తమ కటువంటి భర ద్వాజవిందు చెయ్యగలదనీ తదితతరుల కంతటి శక్తిసామర్థ్యాలు లేవనీ అనుకొన్నారు.

## 3

అంతలో వారందరికీ ఎవరో రత్నపాదుకలతో నడిచివస్తున్న సవ్వడి వినిపించింది. వ్యాసమహర్షి, మున్నూరు శిష్యులు ఒక్కమారుగా తలలెత్తి చూచారు.

గౌరీ విశ్వనాథు లిద్దరు రత్నపాదుకల మెరుపులతో నెమ్మదిగా అడుగులు వేసుకుంటూ వారందరు సమాసీనులై ఉన్న చతుశ్శాలలోనికి విచ్చేశారు.

జయవిజయులుగాని, నందికేశుడుగాని వారిద్దరికీ బరాబరులు చేస్తూ ముందు నడిచి రావడం ఒక పరిపాటి. ఈనాడటువంటిదేమీ కనిపించలేదు.

విశ్వనాథుని ముఖంలో రోషం తాండవిస్తూంది. గౌరీదేవి ముఖం కన్నతల్లి ముఖంలా చల్లని చిరునవ్వు వెన్నెలలు విరజిమ్ముతూంది. జైమిని పైలాది ప్రముఖ శిష్యులందరు విశ్వనాథదేవుని ముఖంలోని రోషావేశం చూచి నోటమాట లేక తమవల్ల ఏమి అపరాధం జరిగిందో అని పరిపరివిధాలుగా మథనపడ్డారు. అయితే అందరు సవినయంగా లేచి నిలబడి ఆపురాణ దంపతు లిద్దరికీ సగౌరవంగా ప్రత్యుత్థానం చేసి సాష్టాంగనమస్కారాలు చేశారు.

కాశీ విశ్వనాథుని దృష్టి ముమ్మొందుగా వ్యాసమహర్షిపై పడింది. వ్యాసుడా క్రోధారుణ ముఖభంగిమ చూచి గజగజ వణకిపోయాడు.

విశ్వనాథుడు వ్యాసునిపై నిప్పులు కురిపిస్తూ ఆజ్ఞాపించాడు:

"దురాత్మా! నీవేదో భారత సంహిత రచించానని కన్నుమిన్ను కానకుండా సంచరిస్తున్నావే! దేవరన్యాయంతో భారతి వంశం నిలబెట్టిన నీకా చిత్యానౌచిత్యజ్ఞానమెక్కడిది? మత్స్యగంధీ ప్రథమ పుత్రుడవై జన్మించిన నీ వీనాడు తగుదునమ్మా అని నా దేవేరి కాశికాదేవిని శపించవలెనని సంకల్పించినావా?

"నిర్భాగ్యుడా! వెంటనే నీవీ కాశీపురి విడిచిపో! పోకుండా నీ విక్కడ ఒక్క క్షణమైనా నిలబడ్డావంటే నీ ముఖం రాతిబండ మీద బరబరా ఈడ్పించివేస్తాను! తెలిసిందా?"

ఆవిధంగా కాశీ విశ్వనాథుడు హుంకరించేసరికి వ్యాసమహర్షి ప్రాణాలు పైనే ఎగిరిపోయాయి. శిష్యులందరు భయోద్వేగంతో ఇక ఏమిచెయ్యడానికీ పాలుపోక అలాగే శిలాస్తంభాలై నిలుచుండిపోయారు.

వెంటనే వ్యాసుడు గౌరీ విశ్వనాథు లిద్దరి పాదాలపైన పడి క్షుధాగ్ని జ్వాలకు తాళలేక ఆవిధంగా అపరాధం చేశాననీ తన తప్పిదం మన్నించవలసినదనీ ప్రార్థించాడు.

అయితే అతను తిరిగి లేచి చూచేసరికి విశ్వనాథు డక్కడ లేడు! గౌరీదేవిమాత్రమే అక్కడ నిలబడి ఉన్నది.

వ్యాసుని దైన్యంచూచి ఆ దేవి ఎంతో జాలిపడి అతని నీవిధంగా ఓదార్చింది:

"నాయనా! నీ వీ విధి పరిత్యానికేమీ భయపడకు! ఆకటిచిచ్చు భరింపలేక ఆ విధమైన దుష్ప్రవృత్తిలో ప్రవేశించావు! అది సహజమే! నేను నిన్నెన్నడు మరవను లే! అయితే విశ్వనాథదేవుని ఆజ్ఞప్రకారం నీవీ కాశీనగరి విడిచి వెళ్ళిపోవలసిందే!

కాని నీవు వేరె ఇంకెక్కడికీ వెళ్ళిపోవలసిన ఆవశ్యకత ఏమీ లేదు! వెంటనే దక్షారామానికి వెళ్ళిపో! అక్కడ భీమనాయకుడు నిన్నెప్పుడు కంటికి రెప్పలా కాపాడుతూండగలడు! దక్షారామం సాక్షాత్తు దక్షిణకాశి! అక్కడ నీకు సమస్తమైన శ్రేయస్సులు సిద్ధించగలవు!"

ఆ విధంగా గౌరీదేవి అభయం ఇచ్చిన తరవాత వ్యాసుడు కొంచెం సేదదీరి శిష్యసంఘంతో కలిసి వెంటనే దక్షిణకాశికి బయలుదేరాడు.

కాశీనగర నిర్వాసనం అతని హృదయానికి తీరని వేదన కలిగించింది.

ఆకటిచిచ్చువల్లగదా! నేనంతటి దేవతాపచారం తలపెట్టాను! ఆకటిచిచ్చెంతటివానినైనా ఆ కృత్యాకృత్య నరకంలో కూలద్రోసివేస్తుందిగదా!"

అని ఆ సమయంలో కృష్ణ ద్వైపాయనుడు తన దుస్సంకల్పాని కెంతో కించపడ్డాడు. ఒకదీర్ఘనిశ్వాసం విడిచిపెట్టాడు. ★


మణిపూస్ 3 జెమ్స్

(1) Model letter & Business Correspondence ... Rs. 1 8
(2) A Dictionary of Idioms & Phrases ... Rs. 1 4
(3) Guide to spelling ... Rs. 0 8

పోస్టేజీ అదనం; ఇంగ్లీషు పుస్తకాలు

A. S. మణి & కంపెని (A. P.)
14, సాంబయ్యర్ వీధి. మద్రాసు - 1.

శ్రీకాఫ్
దగ్గు, ఉబ్బసములకు దివ్యౌషధము
శ్రీవత్స కెమికల్స్ & డ్రగ్స్ లిమిటెడ్, మదరాసు-30